నిచ్చెన

ఇనాయతుల్లా

నేషనల్ హైవే మీద తొంభై కిలోమీటర్ల వేగంతో మెత్తగా పరిగెత్తుతున్న నల్లని క్వాలిస్ బండి సడన్‌గా ఆగింది. మూసిన రైల్వేగేటు రేడియం లైట్లు చీకట్లో మెరుస్తు న్నాయి. క్వాలిస్ వెనుక నుంచి వచ్చిన టాటా సుమో కూడా సైడ్ తీసుకొని ఆగింది.

గేటు అవతలివైపు లారీల హారన్‌లు వినిపిస్తున్నాయి. ఇవేవీ పట్టనట్టుగా తన గది బైట దిమ్మపై కూచున్న గేట్‌కీపర్ చుట్ట లాగిస్తున్నాడు. ఆగి ఆగి దమ్ము లాగి పొగ వదుల్తున్నాడు.

క్వాలిస్ ముందుభాగంలోని అద్దం కిందకు దిగింది. కిటికీలో నుంచి రమణారెడ్డి తల బైటకు పెట్టి సుమో డ్రైవర్‌ను పిల్చాడు. డ్రైవర్ పరిగెత్తుకుంటూ వచ్చాడు. జేబులు వెతికి అగ్గిపెట్టె బైటికి తీసిచ్చాడు. రమణారెడ్డి సిగరెట్ అంటించాడు. అగ్గిపెట్టె తిరిగి ఇస్తూ ఎడమచేతి వేళ్లు ఊపుతూ ఏవో జాగ్రత్తలు చెప్పాడు. ఎడమచేతికున్న బ్రాస్‌లెట్ చీకట్లో మెరుస్తూ ఉంది. డ్రైవర్ తల ఊపుతున్నాడు. ఆ చీకటిని నిశ్శబ్దాన్ని ధ్వంసం చేస్తూ ఒక్కసారిగా నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ గట్టిగా కూతేసింది. రైల్వేట్రాక్‌ను దడదడలాడిస్తూ గేటు దాటింది.

ఆ శబ్దానికి సుమోలో ఉన్న కిష్టిగాడు నిద్ర లేచాడు. ఆవలించి నాలుకతో మీసాలు తడుము కున్నాడు. కళ్లు తెరవాలని ఉంది. కాని కన్రెప్పలు బాగా బరువెక్కినాయి. ఎవర్నో పిలవాలని ఉంది. కాని నాలుక తడబడుతోంది. శరీరాన్ని కదిలించాలని ఉంది. కాని అది సారాపీపా అయ్యింది. కిష్టిగాడు బీడీ కోసం వెతుకుతున్నాడు. చెయ్యి జేబులోనికి పోవడంలేదు. మైకంలోనే పిలుస్తున్నాడు.

"ఒరే బూసి... బూసిగా... జోగిట్ల బీడీ బుడుకులాడురా." పంటి కింద పెదవి నొక్కుతున్నాడు, తూలుతున్నాడు.

సుమో స్టార్టయ్యింది. క్వాలిస్‌ను ఫాలో అయింది. కిష్టిగాడి ప్రేలాపనలు ఆగలేదు.

"ఒరే బాసగా! గీ నడుంగుల ఉండే లైటెయిర నీయవ్వ... బీడీ కనబడకుండుంది," గట్టిగా అరిచాడు.

"ష్. రేయ్. అర్సగా కర్రిలే. ముందు బండిలో రొడ్డి మేల్కొండడు. సప్పిడి జేసినారంటే సప్పరిలిస్తడు," డ్రైవర్ బాష లైటేస్తూ అన్నాడు.

కిష్టిగాని జుబ్బా జేబులో నుంచి నలిగిపోయిన బీడీ బైటికి తీసినాడు బూషి.

"థూ నీయవ్వ మామా! మాంచి సీగ్రెట్ తాగాల్సిన లెవిలు నీది. ఏంది మామ గీ తుంట బీడీలు తాగుతున్నవ్," అన్నాడు బూసిగాడు.

"దీం తల్లి... ఒరే. బాయ నాకొడక. నాకు గిన బంగి రేగిందంటే నేను మన్సిని కాను. యియాల పైట్యాల నుండి ఒక్క బీడీ గూడ తాగల్యా. యాడన్న బీడీ బుడుకులాడిలే. ఒరే బాసగా! నువ్వు బండి ఆపుతావా లేదా," గర్జించాడు కిష్టిగాడు.

కుడిచెయ్యి స్టీరింగ్ మీద పెట్టి ఎడమచేత్తో నెత్తిన బాదుకున్నాడు బాష.

"రేయ్ పత్రా. ఇగో బీడీకట్ట, అగ్గిపెట్టె. నీయవ్వ సంత బెట్టినారు. ఇంగ అర్సకుండ పడుకోని సావ్రా," అంటూ లైటార్పేసినాడు.

బూసిగాడు కట్టలో నుండి బీడీ తీసి కిష్టిగాని నోటికి అందించాడు. అంటించాడు. చాలాసేపటి తర్వాత దమ్ము లాగుతున్నందుకు కిష్టిగానికి హాయిగా ఉంది.

మామూలుగా అయితే సారాయి తాగినాక కిష్టిగాడు మొత్తం మర్చిపోయి నులక మంచం మీద పడి నిద్రపోయేవాడు. మళ్లీ తన భార్య రత్తాలు నిద్రలేపే వరకూ లేచేవాడు కాదు. రత్తాలు మొఖం కడిగించేది. ఇష్టమైనవి వండిపెట్టేది. కిష్టిగానికి రత్తాలన్నా మూడేళ్ల కొడుకు మణిగాడన్నా ప్రాణం. రత్తాలు ఎదురుగా వుంటే అన్నీ మర్చిపోవచ్చనుకున్నాడు. అందుకే కిష్టి బూషిగాణ్ణి, "ఒరే బూషి, మనం మళ్లీ ఇంటికెప్పుడు పోతాంరా," అడిగాడు.

"ఇప్పుడు ఇంటికాన్నుంటే గదా వస్తుండేది? మల్లా ఎప్పుడు పోతామనేది మనకు తెల్సా? రొడ్డి చెప్పాల. మనం పోవాల," అన్నాడు బూషిగాడు.

"ఏం బావ. మల్లా అప్పుడే ఇంటిగాలి మల్లిందా? అవు. ఉప్పుకారం తిన్నోడు ఉండబట్క లేడు కదా బావా," కుశాలుగా మాట్లాడాడు కురవ బాలయ్య.

"నిన్ని బెంగులూరుకు తీస్కపోతున్నారు. అట్లాంటిదానికి తక్కవ ల్యాకుండా సూస్కుంటాడులే రొడ్డి," అందుకున్నాడు మద్దిలేటి.

"ధూనీయవ్వ. నేనొకటి అడిగితే మీరొకటి చెప్తరు గదిలే. ఇంటికాడ రత్తాలు ఒక్కతే ఎన్నాల్లుంటదీ? అనినా ఎదారు," బీడీ పారేస్తూ అన్నాడు కిష్టిగాడు.

"ఇప్పుడు నీ లెవిలే మారిపోయింది బావా! నీ ఇంటి ఎదారి ఒంటి ఎదారి మొత్తం రొడ్డి సూస్కుంటాడు. నూ నెత్తిన తడి గుడ్డేస్కోని సల్లగ పండ్కో," చెప్పాడు బాలయ్య.

కాని కిష్టిగాని మనసు రత్తాలు సుట్టే తిరుగుతోంది. యియ్యాల చేసిన పని రత్తాలుకు తెలిస్తే... అమ్మో... ఆ ఊహే కిష్టిగాన్ని కంపరమెత్తించింది. అందుకే అంత మైకంలో కూడా ఆయాల చేసిన పని మళ్లీ మళ్లీ మతికి చేసుకుంటున్నాడు. కళ్లు మూసుకుంటున్నాడు. మళ్లీ తెరుస్తున్నాడు. రత్తాలు, మణి మాటిమాటికీ కన్నీళ్ల ధారలతో వణుకుతూ కనిపిస్తున్నారు.

కిష్టిగాడు మనిషి రాయి లెక్కటోడు. కష్టానికి వంగేటోడు కాదు. వంగితే మరి లేసేటోడు కాదు. వరికోతల్లో కొర్రకోతల్లో కిష్టిగానితో అందరూ పంద్యాలు కాసెవోల్లు, ఓడిపోయేటోల్లు. గుండ్ల సింగారంల ద్యావర జరిగినప్పుడు పెద్ద గుండునెత్తినాడు. వెండి కడెం గెల్చినాడు. కొలిమి గుండ్లలో మాబు సుబాని ఉరుసులో ఇసక బిందెలెత్తినాడు. ఉంగరం గెల్సినాడు. ఊర్లో పీర్ల పండుగ నాడు అల్లాయిగుంత కాడ పంచ్యాతి పడింది. బారా యిమాం పీరు పట్కోని గుంతలో కిష్టిగాడే దుంకాల అని బోయోళ్లు, కాదు బలిజ రంగన్న దుంకాల అని బలిజోళ్లు. గలాట పడింది. కిష్టి గానికి కోపమొచ్చింది. పిడిబాకు తీస్కోని బలిజ రంగన్నను పొడిసినాడు. మనిషైతే సావలేదుగాని కేసు చాలారోజులు నడిచింది.

సరింగా ఆ టయానే చెన్నంపల్లి శంకర్రెడ్డికి బలిజ సిద్ధారెడ్డికి ఊర్లో పార్టీ పడింది. ఎం.పి.టి.సి ఎలక్షన్లకు శంకర్రెడ్డి తమ్ముడు రమణారెడ్డి మీద సిద్ధారెడ్డి తమ్మున్ని నిలబెట్టినాడు. అందుకని శంకర్రెడ్డి బలిజ గుంపును ఊరిడ్పియ్యాల్ల అని చూస్తున్నాడు. అప్పుడు శంకర్రెడ్డి దృష్టి కిష్టిగాడిమీద పడింది. కేసులో ఇరుక్కున్న కిష్టన్నకు బెయిలిప్పించాడు. అప్పటి నుంచి ఇప్పటిదాక కిష్టిగాని కుటుంబానికి గొడుగైనాడు. కిష్టిగాడు శంకర్రెడ్డి అడుగులో అడుగైనాడు, అని అనుకుంటుంటారు ఊర్లో జనమంతా. కాని నిజంగా కిష్టిగాడే శంకర్రెడ్డికి గొడుగైనాడు. కిష్టిగాని సాయంతో రాజకీయం నడిపినాడు రెడ్డి. కిష్టిగాడు లేకుండా ఊరుదాటి అడుగు బయటికి వేసేటోడు కాదు.

"ఈ పార్టీలు మనకొద్దు బావా! మట్టసంగా కూలి సేస్కోని బత్కుదాం," రత్తాలు కిష్టన్నతో చాలాసార్లు చెప్పింది. మొదటిసారి కిష్టన్న పోలీసుస్టేషనుకు పోయినప్పుడు రత్తాలు నిండు మనిషి. బెయిలు మీద ఇడ్సినంక ఇంటికొచ్చినప్పుడు రత్తాలు నోట్లో చీరకొంగు పెట్టుకొని చాలాసేపు ఏడ్చింది.

గుండెల మీద తలపెట్టి "బావా! ఇట్టాగనైతే నన్నిడ్సిపెట్టు. నేను మా యమ్మోల్ల ఇంట్లనే ఉంట. నువ్వు బజార్ల పడి కొట్టుకుంట సంపుకుంట బత్కనన్ను బత్కు సావనన్ను సావు," అని ఏడ్చింది.

కిష్టిగాడు ఆరోజు మాటిచ్చినాడు మళ్లీ ఇట్లాటి పని చేయనని. కాని శంకర్రెడ్డి ఊరుకోలేదు. ఇంటికి జీపులు పంపడం పిలిపియ్యడం, తనతోపాటు కూర్చోబెట్టుకుని తాగడం... ఇవన్నీ చేస్తుంటే కిష్టన్న కాదనలేక పోయాడు. రత్తాలుకు కూడా ఇక అలవాటైపోయింది. కాన్పు కోసమని పుట్టింటికి పోయింది. సుమారు ఏడు నెలలు అక్కడే ఉంది. ఆమధ్యకాలంలో కిష్టిగానికి పగ్గాలేలేవు. హైద్రాబాద్, విజయవాడ, మద్రాసుకు రెడ్డెంబడి చాలాసార్లు పోయొచ్చినాడు. బంజారాహిల్స్ లో శంకర్రెడ్డికి పెద్ద బంగళా ఉంది. అక్కడ శంకర్రెడ్డి ఎన్నిరోజులు మకాం వేస్తే అన్నిరోజులు హైద్రాబాదులో ఉండేటోడు. యమ్మెల్లేలు, మంత్రులు, ఆఫీసర్లు కిష్టిగానికి రోజూ కనబడే మనుషులు.

చిన్నప్పుడు సందుల్లో గోలీలాడుతూ పోలీసోణ్ణి చూసి నిక్కరు తడుపుకున్న కిష్టిగానికి ఇప్పుడు సి.ఐలు, డి.ఎప్పీలు, ఎస్.పిలంటే లెక్కలేదు. కట్టలు కట్టలు నోట్లు కిష్టిగాని చేతుల మీదుగా పోలీసులకు చేరేవి.

కాని ఇయ్యాల చేసిన పని కిష్టిగాడు తన జీవితం లో చేసిన మొదటి పెద్ద పని. అందుకే కిష్టిగాడు ఎంత వద్దనుకుంటున్నా అదే దృశ్యం... కళ్ల ముందు కదు ల్తోంది. గుండె దడ ఆగకుండా ఉంది. మాటలు తడ బడుతున్నాయి.

సుమో చిక్‌బళ్లాపూర్ మిట్ట మీద మెత్తగా పరి గెడుతోంది. తెలతెలవారుతోంది. డ్రైవర్ బాష టేప్ ఆన్ చేశాడు. శరణం అయ్యప్ప పాటలు సన్నగా వినిపిస్తు న్నాయి. కిష్టన్నకు మత్తు దిగిపోతోంది. మళ్లీ బీడీ ముట్టించాడు. టేప్‌లో పాటాగిపోయింది. బాలయ్య ట్రాన్సిస్టర్ ఆన్ చేశాడు. సుప్రభాతం వినిపిస్తోంది. కొండ మీది రోడ్డు నుంచి సుమో కిందికి దిగుతుంటే కిష్టన్న అద్దం కిందికి దించాడు. నీరెండ వెచ్చగా ఉంది. ట్రాన్సి స్టర్‌లో ప్రాంతీయవార్తలు మొదలైనాయి.

"యాడన్నా బోరంగి సూసి వాపురేయ్ బాషగా!"... మద్దిలేటి కేకేశాడు.

"ధయ్. ఊకే పండ్కో. వాపేది పోయేది అంత నీయిష్టమనుకొండవా. ముందు పెద్ద బండి జూడు. రయ్యిమని తూనీగ లెక్క పార్తుంది. అది యాడ వాగితే మనం ఆడ వాగాల," గట్టిగా అరిచాడు బాష.

"వాయనకేంలే బండినిండా బిస్లర్‌లా, బ్రస్లర్‌లా ఏమంటారో దాండ్లని. అవి బాటల్లు మస్తుగుండయ్," అందుకున్నాడు బూషిగాడు.

"బాటల్లుంటే కొనుక్కున్న నీల్లతోని అన్నీ కడు క్కుంటారాసా?" మద్దిలేటి కసురుకున్నాడు.

"పెట్టిపుట్నోడు నీల్లతోనేంరా నూనెతో గూడా కడుక్కుంటాడు అన మామా," మద్దిలేటి చెప్పిన మాటల్తో అందరూ నవ్వడం మొదలుపెట్టినారు.

"అర్సాకండిరా. ఏదో కర్నూలు వార్త చెప్తుండడు రేడిగలో ఇనర్రి," బాలయ్య గట్టిగా అరిచాడు.

"కర్నూలు మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యదర్శి అయిన శ్రీ ముక్కమల్ల సిద్ధారెడ్డి నిన్న హత్యకు గురయ్యారు. కర్నూలు జిల్లా సంజామల మండలం యెగ్గోని, కోయిలకుంట్ల రహ దారిలో జీపులో ప్రయాణం చేస్తున్న సిద్ధారెడ్డిపై కొందరు గుర్తు తెలియని దుండగులు బాంబులతో దాడిచేసి, వేట కొడవళ్లతో హత్య చేశారు. శ్రీ సిద్ధారెడ్డి మృతికి జిల్లా డి.సి.సి. ప్రధాన కార్యదర్శి శ్రీ కౌలుట్ల సూర్యచంద్రారెడ్డి, రాష్ట్ర పి.సి.సి. ప్రధాన కార్యదర్శి శ్రీ కె.ఎస్. సోమశేఖర్ రెడ్డి తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు," వార్తలు చదువుకుంటూ పోతున్నారు రేడియోలో.

సుమోలో కూర్చున్నవాళ్లంతా ఒక్కసారిగా స్తబ్ధులై పోయారు. ఎవరూ ఏం మాట్లాడడంలేదు.

"దుండగుల కోసం పోలీసులు తీవ్ర గాలింపు చర్యలు చేపట్టారు," చిన్నగా వినిపించిన వార్త కిష్టిగాడికి గుచ్చుకుంది.

"ఇంటివా మామా..." బూషిగాడు కిష్టిగాడిని చేత్తో పొడిచాడు.

"నువ్వుండసీ... ఇంగ కొంచెం పుండు మీద కారం చల్లుతావ్. మధ్యాహ్నం నుంచి ఒగటే గుండెదడ మొద లైంది. కాళ్లు పీకుతుండై. నీకేమిరా. నన్ను మూతికి పెట్టి మీరల్ల గడ్డకు పోయినారు," కోపంగా అన్నాడు కిష్టిగాడు.

"ఎహె. బండెక్కినాల్నుంచి ఆందెం తాగిన మొగంబెట్టినవ్. ఆడేమో రొండు సీసాల సారాయి తాగి నవ్. ఇప్పుడేమో మెత్తిపడిపోయినవ్. ఉసారుగుండు మామా... సేపిచ్చోటోడు... అనకసేయిచ్చోటోడు నీకు ముందుండాడు గదా! నువ్వేం దిగులుపడాకు," కిష్టన్నను ఓదార్చాడు మద్దిలేటి.

"తక్కి... నీ లెవిలు చూడు బావా... అప్పట్లో ముందర రొడ్డి నడుస్తుంటే నూ ఎనక పోతుంటివి. బండిలో వేలాడుకుంటనో, యిరుక్కుంటనో కూసోని పోతుంటివి. యియ్యాల రొడ్డితో సమానంగా నీకో సప్రేట్ బండి. బెంగులూరులో లాడ్జింగ్. దిన్నం బిర్యాని... బీరు... దెబ్బకు రొట్టిరిగి నెయ్యిలపడిందిపో," ఉషారుగా మాట్లాడుతున్నాడు బూషిగాడు.

"నోటికాడి రొట్టె ఎగిరిపోకుంటె సాల్లెయిలే. నువ్వాకె అర్సగాకు"... కిష్టిగాడు ముందు పోతున్న క్వాలిస్ వైపు చూస్తూ చెప్పాడు. బాష టేప్ ఆన్ చేశాడు. సౌండ్ పెంచాడు. బండి బెంగుళూరు శివార్లలో ఉరుకు తోంది. వార్తలలో చెప్పిన వాక్యాలు కిష్టన్న చెవుల్లో గింగురుమంటున్నాయి. బాంబుదాడి, వేట కొడవళ్లు, చిందిన రక్తం... తల్చుకుంటేనే ఒళ్లు జలదరిస్తోంది. అప్పుడేమీ అనిపించలేదుగాని, చేలల్లో కాళ్లకు గుచ్చు కున్న ఫారం ముళ్లు... బాగా నొప్పి పుట్టిస్తున్నాయ్. ఒంటి మీద తువ్వాలు, బట్టలు కమురువాసన కొడుతున్నయ్. కాళ్లను చేతుల్తో తడిమాడు. అరికాళ్లలో అక్కడక్కడా ఫారం ముల్లు గుర్తులు కనిపిస్తున్నాయ్. తన కాళ్లు తనే ఒత్తుకుంటూ ఉంటే తెలియకుండానే కళ్లు మూతలు పడిపోయినయ్.

మళ్లీ కళ్లు తెరిచేలోపు టాటా సుమో ఏదో పెద్ద హోటల్ ముందు ఆగింది. కొంచెం దూరంలో

క్వాలిస్‌ను పార్కింగ్ చేయడానికి డ్రైవర్ తిప్పుతున్నాడు. చెట్టు కింద క్వాలిస్ ఆగింది. ఇద్దరు బండిలో నుంచి దిగి పరిగెత్తుకుంటూ వచ్చి డోర్ తెరిచినారు. రమణా రెడ్డి దిగినాడు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. పై నుండి కింది వరకు గంజి పట్టిచ్చిన తెల్లని బట్టలు. బండిని సైడుకు పార్క్ చేయమని బాషాకు చెప్పినాడు. సెల్ బంద్‌జేసి, "బూషి! మన హీరోని దింపండిరా!"... అన్నాడు. 'రేయ్! ఆ సూట్‌కేసులు పట్కరండి,' అందరికీ ఆదేశాలు జారీ చేస్తున్నాడు. రమణారెడ్డి ముందు నడిచాడు. రిసెప్షనిస్ట్ నమస్తే చెప్పాడు.

"రాండి! రాండి! సామి... శానారోజులకి వచ్చినారు. రేయ్ ఆ ఏసీలు చూపీరా పెదసామికి"... లావు పాటి గొంతులతో కేకలు వేశాడు హోటల్ 'మయూర' యజమాని.

"ఇదిగో రెండేసీలు... 405, 406 పక్కపక్కనే ఇచ్చెయ్యి. సర్ సిక్త్‌ఫ్లోర్‌కు పొండి సార్," రిసెప్షనిస్ట్ రూం బాయ్‌ను పిల్చి తాళాలిచ్చాడు.

అందరూ లిఫ్ట్‌లో వెళ్లారు. రూంలో సామాన్లు సర్దినారు. 405లో రమణారెడ్డి దిగారు. 406లో కిష్టన్న బ్యాచ్‌ను దింపారు.

"కిష్టీ! వారంరోజులు హాయిగా తిని పండుకో. ఏం దిగులుచేయకు. వారం లోపల మొత్తం సెటిలై పోతది" రమణారెడ్డి కిష్టన్నకు ధైర్యమిచ్చాడు.

"ఏమో రొడ్డీ! నాకేమో బయం బయం అవుతుంది. ఇంటికాడ మా ఆడిది, పిలగాడు ఉండారు. ఏమన్నా పోలీసోల్లు గీలోసోల్లు పోయి దౌర్జన్యం చేస్తరో ఏమో"... నసిగాడు కిష్టన్న.

గట్టిగా నవ్వాడు రమణారెడ్డి.

"పోలీసోడు... నీ యింటికాడికా... వాడు పొద్దుగల్ల యింటికి పోవాలనుకుంటె మన యిండ్ల మీదికి వస్తడు. పోలీసోడు మనల్ని తల్సుకుంట పండుకునే టోడు. వాణ్ణి నువ్వేమి తల్చుకోవద్దు. నీ యింటి ఎదారి నాకిడ్సిపెట్టు. నెత్తిన తడిగుడ్డేస్కోని సల్లగ పండ్కో," రమణారెడ్డి బెడ్ మీది నుంచి లేస్తూ చెప్పాడు.

మెట్ల మీద బూట్ల శబ్దం. చూస్తున్నంతలోపే గబగబా పోలీసులు పైకొచ్చేశారు. ఫోర్నాట్ ఫైవ్ ఫోర్నాట్ సిక్స్ అంటూ కన్నడలో మాట్లాడుతున్నారు. ఎస్ఐ ఆదేశాలిస్తున్నాడు. పోలీసులు రూంలలో దూరి సోదా చేస్తున్నారు. కిష్టిగాని గుండెల్లో దడ పట్టింది. అందరూ లేచి నిలబడి ఆశ్చర్యంగా చూస్తున్నారు.

ఆంధ్ర పార్టీ... అదొక్కటి మాత్రమే పోలీసోల్లు మాట్లాడినదానిలో అందరికీ అర్థమైన మాట.

"రమణారెడ్డి యం.యల్.ఎ, కర్నూలు డిస్ట్రిక్ట్. ఏంకావాలి మీకు?" అబద్ధమే అయినా గట్టిగా చెప్పాడు రమణారెడ్డి.

"ఎ. చెన్నగౌడప్ప, సిఐ ఎక్సైజ్ పార్టీ రైడింగ్... శేషాద్రినాయుడు... ఆంధ్ర పార్టీ ఫ్రం కడప... ఇల్లిసిట్ లిక్కర్ బిజినెస్," చెప్పాడు సి.ఐ.

"లిక్కర్ గిక్కర్ ఇల్లె... ఫ్రెండ్స్ జాలీ ట్రిప్," చెప్పాడు రమణారెడ్డి.

"సారీ... థాంక్యూ"... మెట్లు దిగి వెళ్లిపోయారు పోలీసులు.

కిష్టిగాడు హమ్మయ్య అనుకుంటూ ఊపిరి పీల్చుకున్నాడు.

అందరూ ప్రశాంతంగా కూర్చున్నారు.

"ఏందంట రెడ్డి... మల్లొస్తారా వాల్లు," మద్దిలేటి భయపడుతూ అడిగాడు.

"ఆ ఎవరో దొంగసారాయి అమ్ముతున్నారని..." ఈ రూం నంబర్ చెప్పినారట. పట్కపోనీకి వచ్చినాడు పోతావా..." వెటకారంగా అన్నాడు రెడ్డి.

"నాకేం పట్టింది రెడ్డి... అట్లాటి దర్పేసి యాపారం మనం ఎన్నడన్నా సేసినామా," నెత్తి గీరుకుంటూ చెప్పాడు మద్దిలేటి.

"ఒరే బూసి. ఎంతమంది ఉండారో ఎంచుకోని... కిందికిపోయి బువ్వ తిని మీరొచ్చేతప్పుడు రొండు బిర్యాని ప్యాకెట్లు పట్కరండి," డబ్బులిచ్చాడు రెడ్డి.

"అరె ఓబులేశూ... మన బండికాడికి పోయి ఒక సారి లోపలి సామాన్లన్నీ బద్రంగా వున్నాయో లేదో చూసిరా. బాషగాణ్ణి బండ్లోనే ఉండి, ఆడే టిపిన్లు, భోజనాలు చెయ్యమని చెప్పు. అసలే కాలాలు బాగా లేవు. బండిడ్సి పక్కకు పోవద్దని చెప్పు."

సామాన్లు అనగానే ఓబులేశుకు బండిలో కార్పెట్ కింద వుండే పొడవాటి వేటకొడవళ్లు, గొడ్డళ్లు గుర్తుకొచ్చినాయి.

"అట్లే... రెడ్డి," అంటూ బూసి, ఓబులేశు మెట్లు దిగిపోయినారు.

"ఒరే బూసి... మన రెడ్డి ఎమ్మెల్లే ఎప్పుడైనాడురా," అడిగాడు ఓబులేశు.

"ఉత్త సుల్ల కూతలు. ఎమ్మెల్లే అనేపాటికే పోలీసోడు... పీనిగెలెక్క పక్కగ నీలుక్కునె. సూస్తివా లేదా... ఇట్ల సుల్లలు సెప్పేరా... ఈని గాల్లు పెద్దోలయ్యేది," చెప్పుకుపోతున్నాడు బూషి.

"అవుగదరా... ఎంత సుల్బంగా జెప్పే అబద్దాలు. మనూర్లోనే అనుకుంటే తక్కి... బెంగుళూర్ల గూడా పోలీ

సోల్లు బయపడ్తరు మన రెడ్డికి,'' ఓబులేశు ఆశ్చర్యం వ్యక్తం చేశాడు.

"గంజి పట్టిచ్చిన తెల్లబట్టలు కిర్రుచెప్పులు... చేతిలో ఆ గొలుసు ఆ ఫోను... ఆ లెవిల్ సూసినాక ఎవనికైనా తడైపోతది. నీకు నాకు వస్తద్యా ఆ లెవిలు,'' అడిగాడు బూషి.

"ఎన్ని జన్మలెత్తినా రాదులేగాని... ఇంతకీ కిష్టి గాని గతేందిర ఇప్పుడు?'' అడిగాడు ఓబులేశు.

"ఏమో. వాని రాత ఎట్లుందో ఏం కతనో ఎవడు సూసినాడు వాని అదురుష్టం.''

మాట్లాడుకుంటూ పోతున్నారిద్దరూ.

*

"నీకేం పొయ్యే కాలమొచ్చిందిరా. సగరు పొద్దైనా యింగా నిద్దరపోవు... పండ్కో,'' నులక మంచం మీద మణిగాడిని జోకొడుతున్న రత్తాలు మొఖం మీద ఏదో లైటు పడింది.

కటిక చీకట్లో కమాండర్ జీపు గుంతల రోడ్డు మీద గుంజుకుంటూ వస్తోంది. లైటు పడిన వైపే చూస్తుంది రత్తాలు. సరిగ్గా తన యింటి దగ్గరే ఆగింది. ఒక జులపాల మనిషి జీపు దిగి, "రత్తాలు... రత్తాలు!'' పిల్చాడు.

కొంగు సవరిచ్చుకుంటూ వచ్చింది రత్తాలు.

"ఎవరూ''... కనుగుడ్లు తేలేసి అడిగింది.

"పెద్దరెడ్డి వచ్చినాడు నిన్న పిలుత్సున్నాడు రానంటరా''... జులపాల మనిషి చెప్పాడు.

మణిగాడిని ఒక చేత్తో జొకొట్టుకుంటూ బైటి కొచ్చింది రత్తాలు. పెద్దరెడ్డి అనబడే శంకర్రెడ్డి బండిలో కూర్చుని ఉన్నాడు. రెండు చేతుల్తో నమస్కరించింది రత్తాలు.

"ఆ రత్తాలు... నీకేం గావాలన్నా యింటికాడికొచ్చి చెప్పు. కిష్టిగాడి ఎదారి చెయ్యకు. వాడు బద్రంగా వుండాడు,'' అన్నాడు రెడ్డి.

"యాడుండాడు రెడ్డి...'' గొంతు పెగలకుండా వుంది రత్తాలుకు.

"యాడో ఒకచోట బద్రంగా ఉన్నాడు. ఓ వారం పదిరోజుల్లో తిరిగొస్తడు,'' చెప్పాడు రెడ్డి.

"ఏమో సామి... నాకు బయమైతాంది... పొద్దున సింగారం కాన్నుండి మంచులొచ్చి మావాయన కోసం బుడికినారంట... నేను కూలికి పోయింటి. పక్కనుండే టోల్లు సెప్పిరి,'' పిల్లగాణ్ణి భుజం మారుస్తూ చెప్పింది రత్తాలు.

"కూలికి పోతున్నావా! ఎందుకు పోతున్నవ్ సల్లగ మా ఇంట్ల యింత పని చేస్కొని యింత ముద్ద తిని ఉండు... అర్థమైందా,'' రెడ్డి రత్తాలు కళ్లలోనికి సూటిగా చూస్తూ మాట్లాడుతున్నాడు.

అంత చీకట్లో రత్తాలు తెల్ల మొగం, చక్కని ముక్కు, పొడవాటి కళ్లూ బాగా కనిపిస్తున్నయ్. ఇంకా ఏమో అడగాలనుకుంది రత్తాలు. అంతమంది మొగోళ్ల నడుమ నిలబడి మాట్లాడడం ఇష్టంలేదు తనకు. జీపు స్టార్టయ్యింది. రత్తాలు లోపలికెళ్లింది. తడక అడ్డం పెట్టింది.

"సన్నాసోడు... సంసారం సేయనీక శ్యాతకానోనికి పెండ్లామెందుకు... పిల్లలెందుకు?'' మణిగాణ్ణి మంచం మీద దబ్బున పడేసింది. సిద్ధారెడ్డిని చంపినారని తెలిసింది. సిద్ధారెడ్డికి, శంకర్రెడ్డికి పార్టీ ఉందని తెల్సు. ఇప్పుడు కిష్టిగాడు కనపడకుండా పోవటం... శంకర్రెడ్డి వచ్చి పరామర్శించడం... రత్తాలుకు అనుమానం బలపడింది.

"మొగుడనే ముండాకొడుకు యాడో ఉంటే ఈ మూడుగాసలోని యింట్ల పన్జేసుకొని బత్కలంట... థూ... జలమగాల నాకేం ఖర్మ పట్టింది. నా కూలిపని నాకు బువ్వ పెట్టది,'' మణిగాణ్ణి నిండుగా కప్పుతూ వాడి మీద చెయ్యేసి... "నన్నాసిచ్చుకోనోడిని నేనెందుకు కాసిచ్చుకోవలపోనీ...'' నిద్రలోకి జారిపోయింది రత్తాలు.

*

ఆదివారం... ఊళ్లో అక్కడక్కడా కుప్పలు వేసిన మాంసం అంగళ్లు, కూరగాయల గంపలు, రోడ్డు పొడవునా కనిపిస్తున్నాయ్. చాలాసేపటి నుంచి కొడ్తున్నా బోరింగు చుక్క రాల్చడంలేదు. వదులుగా ఉండే అంగీని ఎగేసుకొంటూ కొడ్తున్నాడు పదేళ్ల పిలగాడు. బోరింగ్ దగ్గరాగింది టాటా సుమో. దిగిన వాళ్లంతా పంచలు దులుపుతున్నారు. తలలో నుంచి దుమ్ము రాల్పుతున్నారు.

"ఇంత మొగాలన్నా కడుక్కొని పోదాం పార్రా. ఇండ్లకాడ మొగాలు జూసి వాకిండ్లన్నా ఏసేరు,'' మద్దిలేటి సరదాగా మాట్లాడుతున్నాడు.

కిష్టిగాడు దిగిందే తడవు ఇంటిదారి పట్టాడు. నడుస్తుంటే కొద్దిసేపట్లో రత్తాలును చూడబోతున్నానన్న ఆనందం... నరాలు కరెంటుతీగల్లా మారుతున్నై. పిడికిళ్లు మూస్తూ తీస్తూ వెళ్తున్నాడు. తడిక తీశాడు. మణిగాడు మట్టిలో ఆడుతున్నాడు. చూడగానే "నానొచ్చె... నానొచ్చె...'' ఆనందంతో పరిగెత్తుకొచ్చి చుట్టుకున్నాడు.

కిష్టి వాణ్ని వెంటనే చంకకెత్తుకుని ముద్దులాడుతున్నాడు. కళ్లు రత్తాలునే వెతుకుతున్నై.

"అమ్మేది బుజ్జీ. యాడికి పోందిరా," గోము చేస్తూ అడిగాడు. చంకలో బిందెతో కొంగు తలపై చుట్టుకుని వాకిలి దగ్గర నుంచి వచ్చింది రత్తాలు. ఒక్క నిముషం ఆగిపోయింది. నెలరోజుల తర్వాత కనిపించిన తన మొగుడిలో మార్పులేమున్నాయోనన్నట్టు చూసింది. కిష్టిగాడు నిశ్చేష్టుడైనాడు. పిలగాణ్ణి దించేసినాడు. రత్తాలునే చూస్తున్నాడు. ఏం మాట్లాడలేదు. రత్తాలు బిందెలో నీళ్లతో లోపలికి నడిచింది. కిష్టిగాడు వెంట నడిచాడు. కిష్టి తలుపెయ్యబోయినాడు.

"ముందు కాళ్లు మొగం కడక్కురా పో," విసురుగా అనింది.

ఎలాగైతేనేం రత్తాలు తనతో మాట్లాడినందుకు చాలా సంతోషించాడు కిష్టి. గబగబా వెళ్లి కాళ్లు కడుక్కున్నాడు. రత్తాలు సిల్వరు కంచంలో అన్నం పెట్టింది. ఎల్లిపాయ కారెం, చింతొక్కు కలుపుకొని కిష్టి లొట్టలేసుకుంటూ తింటున్నాడు.

"ఎన్నాళ్లయిందే నీ సేతి బువ్వ తినక," అన్నాడు.

"బెంగుళూర్ల బిర్యానీ తిన్నా ఈ రుసి రాల్య," అన్నాడు.

పొయ్యిలో కందికట్టె పెట్టి వూదరగొట్టంతో వూదుతూ, "సిన్నా! అంగి యిప్పెయ్యి లాల పోసుకుందువుగాని," అంటోంది రత్తాలు.

రత్తాలు తనను పట్టించుకోవడంలేదు. తాను బెంగుళూర్లో ఏ హోటల్లో ఉన్నదీ ఏమేమి తిన్నదీ ఏమేమి చూసింది మొత్తం చెప్పుకుపోతున్నాడు కిష్టి.

"ఇగో. రత్తాలు ఇక్కడ సూడే నేన్చెప్పేది ఇను," రత్తాలు వెంట వెంటనే తిరుగుతున్నాడు కిష్టి.

"నువ్వు నాకేం సెప్పేదీ వొద్దు. నేనిన్నడిగేదీ వొద్దు. నన్ను నా పిల్లగాన్ని సల్లగా బత్కనీ నువ్విట్లనే... వాల్లింటి కాడ కుక్కలెక్క శానా యిశ్వాసంగా బత్కుతనంటే నీ యిష్టం. నేను మా యమ్మోల్లింటికెల్లి పోతా," పిల్లోణ్ణి తువ్వాలుతో తుడుస్తూ విసురుగా అనింది రత్తాలు. రత్తికి కోపం తగ్గేవరకు ఏ మాటా మాట్లాడకుండా వుండడమే మంచిదనుకున్నాడు కిష్టి. అలసిపోయి వున్నాడు. దుప్పటి కప్పుకొని కుక్కి మంచలో నిద్రపోయినాడు.

*

ట్రింగ్... ట్రింగ్... కొత్త సైకిల్ శబ్దం విని మట్టిలో ఆడుకుంటున్న మణిగాడు పరిగెత్తుకొచ్చినాడు.

"నాయే... కొత్త చేకిలు... టింగ్... టింగ్... నాకు..." మణిగాడు సైకిల్ మీది కెక్కించమని పట్టుపట్టాడు.

కిష్టిగాడు స్టాండేసి వాణ్ని సైకిల్ సీటు మీద కూర్చోబెట్టినాడు. అద్దంలో వాని మొగం చూసి మురిసిపోయినాడు. కొద్దిసేపు సైకిల్లో తిప్పి తెచ్చి ఇంట్లో పెట్టినాడు.

సైకిల్‌కు తగిలించిన సంచీ లోపలికి తీసుకెళ్లి "రత్తాలు, దాంట్లో ఏమున్నాయో చూడు... నీకు శానా యిష్టమైనవి ఉండై," అన్నాడు ఆమెను ఊరిస్తూ.

రొట్టెలు చేస్తున్న చేతిని గబగబా నీళ్లతో కడుక్కొని రత్తాలు సంచి తీసింది. ప్యాకెట్ విప్పింది. రోజా రంగు చీర, జాకెట్, లోబాడీ... రత్తాలు ముఖం విప్పారింది.

"ఎక్కడివి... దుడ్లు ఎవురిచ్చినారు?" చీర మడతలు తీసి చూస్తూ అడిగింది.

"నావే... నీకోసం... కష్టపడి తెచ్చాను," కిష్టిగాడు జవాబిచ్చాడు.

"అన్ని డబ్బులెక్కడి నుంచి వచ్చినయ్ నిజం చెప్పు," కళ్లు వెడల్పు చేస్తూ అడిగింది.

"చెంద్రబాబిచ్చాడు," నవ్వుతూ అన్నాడు కిష్ట.

"ఇగో... ఇట్లాటి ఎగతాలి కూతలే వద్దనేది. నిజం చెప్పు బావా!" కొంచెం గోముగా అడిగింది రత్తాలు.

"నిజ్జంగానే చెంద్రబాబే ఇచ్చినాడు. గ్యాస్‌స్టవ్ పోయింది. డుం...డుం...డుం... నీకు సీర రైకొచ్చింది డుం...డుం...డుం," ఊగుతూ చెప్పాడు కిష్టి. రత్తికి అవి ఎక్కడి నుంచి వచ్చినాయో అర్థమైపోయింది.

"ఇగో నువ్వు కష్టపడి సంపాయిచ్చిన దుడ్లతో ఇట్లాటివి తీస్కరా... అంతేగాని... ఇట్ల ఉద్దర దుడ్లతోని కొన్కరావాకు," విసిరి మంచం మీద పడేసింది రత్తి.

నిజంగానే తనకు ఆ రంగు చీర చాలా ఇష్టం. వదులుకోవాలని లేదు. కాని అట్లాంటి డబ్బుతో కొన్నవి తొడగాలని లేదు. కిష్టి కొంచెం దగ్గరగా వచ్చి, "పోనీ అప్పు కింద తెచ్చినామనుకో నీ కూలి దుడ్లు నెలకింత కట్టు. కాదనకే," అన్నాడు.

పక్కన పొయ్యి మండుతోంది రత్తాలు మొగం లెక్కనే. ఇంగ చాలాసేపు కిష్టి నిలబడలేదు. మణిగాన్ని ఎత్తుకొని వెళ్లిపోయాడు.

*

పార్టీ కార్యాలయం చాలా బిజీగా ఉంది. లోపల శ్రమదానం, జన్మభూమి పోస్టర్లు, కటౌట్లు నిండిపోయి ఉన్నాయి. రమణారెడ్డి ఛాంబర్‌లోకి పోవడానికి

బయట చాలామంది వెయిట్ చేస్తున్నారు. అప్‌స్టేర్స్‌లో శంకర్రెడ్డి ఛాంబర్. పైనుంచి కొంతమంది దిగి వస్తు న్నారు. కొంత మంది పైకి వెళ్తున్నారు. కోయిలకుంట్లలో 'మయూరి' పేరు మీద నడుస్తున్న థియేటర్, వైన్స్, లారీ సప్లయి, శ్లాబ్ పాలిషింగ్, చిప్స్, చిట్స్ మ్యానేజర్లు రమణారెడ్డికి అకౌంట్ల అప్పగింత కోసం రోజూ సాయంత్రం వస్తుంటారు. నాపరాళ్ల క్వారీలలో ట్రాక్టర్లు లారీల లోడ్లకు మామూళ్లు వసూలు చేసే కౌంటర్ ఓబులేశు, మద్దిలేటి చూసుకుంటారు. అటెండర్ కోసం బెల్ మ్రోగింది. అటెండర్ లోనికెళ్లాడు.

"బయట కాంట్రాక్టర్ రామస్వామిని పిల్చు," రమణారెడ్డి రివాల్వింగ్ ఛెయిర్‌లో తిరుగుతూ చెప్పాడు.

రామస్వామి లోపలికెళ్లాడు.

'ఏమబ్బా! యాడివరకొచ్చింది నీ యింకుడు గుంతల పని?" కూర్చోమని చేయి చూపుతూ అడిగాడు.

"ఐపోతాది రెడ్డి. ఇంగ రెండ్రోజుల్లో కంపిలీట్ అయితది. బిల్లు తొందరగ చేయమని కొంచెం ఆ డి.యికి చెప్పు రెడ్డి. ఆ ప్రాక్లెయిన్ల బాడుగ గూడ కొంచెం చూసి తీస్కో రెడ్డి."

"చూసేది గీసేది ఏం లేదుగాని ఎంత చెప్పింటే అంత. డి.యికి చెప్తలే. రేపు సాయంత్రం కల్చు," ఎక్కువసేపు మాట్లాడే టైంలేదు రెడ్డికి. ఒకరి తర్వాత ఒకరు మొత్తం మయూరి గ్రూప్స్, అకౌంట్స్ లావా దేవీలు చూస్తున్నాడు.

ఇంతలో బయట తప్పెట్లు, ఈలలు, కేరింతలు వినిపించాయి. సిటీ కేబుల్‌లో స్క్రోల్ వస్తుంది.

కోయిలకుంట్ల అసెంబ్లీ స్థానానికి అధికారపార్టీ టిక్కెట్ భీమునిపాటి శంకర్రెడ్డికి లభించింది. రేపు 11 గంటలకు నామినేషన్... స్క్రోల్ చూసి రమణారెడ్డి ఇంటర్‌కం ఫోన్ అందుకున్నాడు. జనం పూలదండల్తో శంకర్రెడ్డిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు.

మర్నటిరోజు నామినేషన్‌పర్వంలో కిష్టి చెన్నంపల్లె నుంచి జనాన్ని లారీల్లో తోలాడు. భారీగా ఊరేగింపు జరిగింది. అల్లర్లు జరగకుండా పోలీసుశాఖ బందోబస్తు ఏర్పాటుచేసింది. 'ఫ్యాక్షన్‌జిల్లాలో హోరాహోరీ' బాక్సులు కట్టి పత్రికలు వార్తలు రాశాయి. ఒకపక్కన ముక్కమల్ల యర్రారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి. సిద్ధారెడ్డి తమ్ముడిగా, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా శంకర్రెడ్డికి గట్టి పోటీ నిస్తున్నాడు. మరొకపక్కన అధికారపార్టీ అభ్యర్థిగా అన్ని హంగులు కలిగిన శంకర్రెడ్డి అంటూ పత్రికలు ఉత్కంఠ భరితమైన వార్తలు వ్రాశాయి. ఇరుపక్షాలలోని డబ్బు, సారా, రిగ్గింగ్ గ్యాంగ్‌ల మధ్య రసవత్తర పోటీ జరిగింది. ఎట్టకేలకు పద్నాలుగు వేల మెజార్టీతో శంకర్రెడ్డి ఎమ్మెల్లే అయినాడు. మంత్రి జీవన్‌రెడ్డి జోస్యం చెప్పినట్టు పాత ముఖ్యమంత్రి మళ్లీ ప్రమాణ స్వీకారం చేశాడు.

*

"ఈనే సూడ్రేయ్ కొత్తగొచ్చిన ఎస్.పి. దేవానంద్," పేపర్లో ఫోటో చూపిస్తున్నాడు బూసిగాడు.

"ఏదీ ఏదీ సూద్దాం," టీ తాగుతున్న వాళ్లంతా పేపరు చుట్టూ మూగారు.

"ఒరే పూర పొట్టిగాని లెక్కున్నడుగాని జిల్లాను అల్లాడిస్తున్నాడు కదర..." మద్దిలేటి పేపర్ దగ్గరగా పెట్టుకుంటూ అన్నాడు.

"ఆళ్లగడ్డల భాస్కర్‌రెడ్డిని, పత్తికొండలో హను మంతరెడ్డిని, అవుకులో రాజారెడ్డిని... ఎవరు దొర్కితే వాళ్లని బొక్కలో పెట్టినాడంట," ఆనోట ఈనోట విన్న దంతా చెప్పుకుపోతున్నారు జనం.

"పాతకేసులన్నీ మల్లా తోడి ఒక్కొక్కని తోలు తీస్తున్నాడంట. పైనుండి ముక్యమంత్రే వాయనను అదే పనిగా పంపిచ్చినాడంట," గుంపులో ఒకరన్నారు.

"బ్రాడ్‌గేజీల, రిజర్వాయరుల, కెనాల్‌కట్టలో... యాడబడితే ఆడ కమిషన్లు గుంచి దుడ్లు కుప్ప పోస్కుంటుండరు ఈల్లంతా..." టీ సప్పరిస్తూ మాట్లాడు తున్నాడు హోటల్ యజమాని.

"పెద్ద పెద్ద నాయకులంతా ఊర్లిడిసి హైద్రా బాద్‌ల మకాం బెడ్తున్నారంటనే," అడిగాడొకాయన.

"అందుకొనమేనా మన శంకర్రెడ్డి గూడ కర్నూలుకు కాపురం మార్చినాడు," ఓబులేశు చప్పట్లు కొడుతూ రహస్యం కనుక్కున్నట్టు గట్టిగా అరిచాడు.

"మల్ల కిష్టిగాని గతేందిరా," బూషిగాడు అడిగాడు.

"ఏముందీ! వాయిలేసినోని లెక్క వాయిదాలకు తిరుక్కుంట ఉంటడు," పెదవులు విరుస్తూ చెప్పాడు మద్దిలేటి.

ఎస్.పి. పర్యటనలో చెన్నంపల్లి ఒకనాటి మజిలీ అయింది. స్థానిక పోలీసుల సమాచారం మేరకు రమణారెడ్డి, కిష్టిగాడు, ఓబులేశు, బూసిగాడు ఊరి నుంచి పరారైనారు. ఎన్నికల్లో జరిగిన గొడవల్లో సంజామల ఎస్.ఐ. దాడికేసులో వీళ్లు నిందితులు. కిష్టి ప్రధాన ముద్దాయి. కారు ఊర్లోకి రాగానే స్థానిక పోలీసులు పరుగెత్తిపోయి సెల్యూట్ చేశారు. ఎలి మెంటరీ స్కూల్ ఆవరణలో మీటింగ్ జరిగింది.

"ఊళ్లో ఎన్ని వర్గాలున్నాయి?" గుమిగూడిన జనాన్ని ప్రశ్నించాడు ఎస్.పి.

"అస్సలు వర్గాలే లేవు సార్," జవాబు.

"సారాయి బాగా అమ్ముతున్నారా?" ప్రశ్నించాడు.

"అస్సలీ ఊర్లో దాని వాసనే రాదు సార్," జవాబిచ్చారు.

"మరెందుకు ఫ్యాక్షన్ గ్రామమని ముద్ర పడింది," ప్రశ్నించాడు.

"మేమెప్పుడో సిన్నగున్నపుడు శంకర్రెడ్డి వాళ్ల నాయన శివనాగిరెడ్డిని వాయన జీతగాళ్లే సంపినారు సార్. ఇంగప్పటి నుండి యిప్పటిదాంక ఈ ఊర్లో ఎవరే గాని సంపడంగాని, సంపుకోవడంగాని జరగనేలేదు సూడు సారూ," ఒక ముసలాయన చెప్పాడు.

"సిద్ధారెడ్డి ఎలా చచ్చిపోయాడు," అడిగాడు ఎస్.పి. జనం అందరూ ఒకరి మొగాలు ఒకరు చూసుకున్నారు.

"ఆయన హత్యతో మీ ఊరివాళ్లకు సంబంధం ఉందా?" గద్దించాడు ఎస్.పి.

"అదేమో మాకు తెలదు సూడు సారూ... వాయనది సింగవరం. మాది సెన్నంపల్లే. కోర్టు వాయిదాలకేమో, మా ఊరోల్లు ఇద్దరు తిరుగుతుండారు. అదొగటి తెల్సు సూడు సారూ!" ఒకామె లేచి చెప్పింది.

ఆమె వైపే అందరూ చూశారు.

"సరే! అది నాకు తెలుసుగాని... ఇంతవరకూ జరిగిందేదో జరిగిపోయింది. యిప్పటి నుంచి ఊర్లో గలాటా లేకుండా ప్రశాంతంగా గడపాలి. పంచాయితీలు చెప్పించుకోవడానికి పెద్ద మనుషులు దగ్గరకు పోవద్దు. సమస్య ఉంటే స్టేషన్‌కు రండి. ఊర్లో బాంబులు పేలడంగాని, సారాయి అమ్మడంగాని, కొట్టుకోవడంగాని చేశారంటే ఎవ్వరని చూడకుండా లోపలేస్తా. జన్మలో బైటికి రాలేరు. అర్థమైందా..." వేలు చూపుతూ ఉపన్యాసమిస్తున్నాడు ఎస్.పి. అందరూ నిశ్శబ్దంగా విన్నారు. కారెక్కిన తర్వాత ఎస్.ఐ. స్వామినాథంను పిల్చాడు. ఏవేవో ఆదేశాలిస్తున్నాడు. ఈన తల ఊపుతున్నాడు. కారు స్టార్టయ్యింది. పోలీసులు సెల్యూట్ చేశారు.

*

చెన్నంపల్లె నుండి మకాం మార్చినాక కిష్టిగాడిని శంకర్రెడ్డి పిలిపించడం లేదు. కోర్టు వాయిదాలప్పుడు తప్ప మధ్యలో కిష్టిగాడు వాళ్లను కలవడంలేదు. ఎస్.పి. వచ్చిపోయింతర్వాత కిష్టిగాడిలో భయం పెరిగింది. ఊళ్లో కిష్టిగాడ్ని ఎవ్వరూ కూలికి పిలవడం లేదు. రచ్చ కట్ట దగ్గరికి పోగానే ఎవరంతకు వాళ్లు అక్కడి నుంచి మెల్లగా జారుకుంటారు. మరీ మాట్లాడితే భయపడతారు. ఇక ఆ ఊళ్లో బ్రతకడం కష్టమనుకున్నాడు కిష్టి. రత్తాలు పుట్టిల్లు 'అస్పరి'కి వెళ్లిపోదామనిపించింది. అక్కడైతే కిష్టిగాడు హాయిగా పనిచేసుకొని బ్రతకొచ్చనుకున్నాడు. చెన్నంపల్లె నుంచి అస్పరికి మకాం మార్చారు. ఒకసారి కర్నూలుకు వెళ్లి శంకర్రెడ్డికి కనబడాలనుకున్నాడు.

*

"మొత్తం రెండు లక్షల అర్వైనాలుగు వేలు సార్. నాలుగు లోడ్లు... లెక్క చూసుకోండి సార్," పి.ఎ ఇచ్చిన డబ్బులందుకున్నాడు శంకర్రెడ్డి.

'ఇదిగో జన్నారెడ్డి, తీసుకోబ్బా నీ 'పనికి ఆహారం' వాటా. లక్షా ముప్పై రెండువేలు తీసుకొని మిగతాది లోపలిచ్చేయి. ఇగ సాలిచ్చుండి. లోడ్లు పట్టుకుంటున్నారు. పరిస్థితులు బాగలేవ్..." మాట్లాడుతూ మధ్యలో చెయ్యెత్తాడు శంకర్రెడ్డి.

"రేయ్ శీనూ బండి రెడీ చెయ్," అంటూ డ్రైవర్‌ను పిలిచాడు. తనను చూసి కేవలం చెయ్యెత్తినందుకు మనసు కలుక్కుమనింది కిష్టిగానికి. సంవత్సర కాలంలోనే ఇంత మార్పు వస్తుందనుకోలేదు. డ్రైవర్ క్వాలిస్‌ను బైటికి తెచ్చాడు. గన్‌మెన్‌లు రెడీ అవుతున్నారు. ఒకప్పటి తన టాటాసుమో గుర్తొచ్చింది కిష్టన్నకు. ఇప్పుడా స్థానంలో గన్‌మెన్‌లు, పి.ఎలు, ఆఫీసర్లు... వింతను చూస్తూ కిష్టి క్వాలిస్ డోర్ దగ్గర నిలబడినాడు.

సెల్‌ఫోన్ బైటికి తీస్తూ, "ఆ! ఏరా కిష్టి... బాగున్నావ్ కదా... ఐపాయలే, రొండు వాయిదాలుంటై... పోయి రమణారెడ్డన్నతో మాట్లాడు..." అంటూ క్వాలిస్ ఎక్కాడు. బయల్దేరింది. గేట్లు మూసుకున్నాయి.

రమణారెడ్డి కోయిలకుంట్లలో వ్యాపారాలు చూసుకుంటూ అక్కడే ఉన్నాడని తెలిసింది. అంత దూరం వెళ్లడానికి కిష్టికి ఛార్జీలకు యిబ్బందిగా ఉంది. పొరలు పొరలుగా గతం గుర్తొస్తోంది. సుమో, ట్రాక్స్, క్వాలిస్‌లు తనకిప్పుడు ఎంత దూరమో తెలిసొచ్చి ఏడుపొచ్చింది. కిష్టి కర్నూలు బస్టాండులో పత్తికొండ బస్సెక్కాడు.

*

"రత్తీ... లోపల్నుంచి చిలుకు పెట్టుకో. నేను పత్తి కొండ సంతకు పోయొస్తా"... కిష్టన్న సంచితో బయల్దేరి నాడు.

"నానే... నేనొత్త... పత్తికొన్న సంతకు" మణిగాడు వెంటబడ్డాడు.

"వద్దు నాయనే... నీకేం గావల్ల? చెప్పు నేను తీసు కొస్తగానీ"... సముదాయించాడు కిష్టన్న.

"మల్లీ రేపు దీప్యాలపండగ... నాకు లచ్చిం బానాలు, వంకాయ బాంబులు, సురసుర బత్తీలు, భూ చక్రాలు తెస్తవు గదా"... మణిగాడు గోముగా అడిగాడు.

"ఊ... తెస్త... నూ లోనికిపో..." పంపించి పక్కింటి సోములన్నతో బయల్దేరినాడు కిష్టిగాడు.

పండగ సంత జనంతో కిటకిటలాడుతోంది. పండగ సరుకులు కొన్నాడు. మణిగాడు చెప్పిన వంకాయ బాంబులు, భూచక్రాలు కొన్నాడు కిష్టన్న. సోములన్నతో కలిసి హోటల్లో టిఫిన్ చేశాడు. సంత గేటు దాటి బస్టాండువైపు మలుపు తిరుగుతున్నారిద్దరు. రెండు జీపులు సర్రున వాళ్లిద్దరికి అడ్డంగా వచ్చి నిలబడి నాయి. దబదబ పోలీసులు దిగారు.

"కిష్టన్న... ఎస్.ఐ. పిలుస్తున్నాడు పోదాంరా," అంటూ రెండు చేతులు పట్టుకొని జీపు దగ్గరికి తీసుక పోయినారు.

సోములన్నకు ఏం జరుగుతుందో అర్థం కాలేదు.

కిష్టన్న, "ఎందుకు సార్! నేనేం జేసినానని?" అన్నాడు. అతని ఒళ్లంతా చెమట్లు పట్టినాయి.

"ఏం చెయ్యలా ఎస్.ఐ నీతో మాట్లాడి పంపిస్త డంట రా. జీపెక్కు," అన్నాడు కానిస్టేబుల్.

"సోములు! ఇంటికాడ చెప్పు కొంచెంసేపుండి వస్తాను," భయంతోనే జీపెక్కాడు కిష్టి.

*

'కిరాయి హంతకుని ఎన్‌కౌంటర్,' అన్న వార్త అన్ని దినపత్రికల్లో మెయిన్‌పేజీలో ఫోటోలతో సహా వచ్చింది.

"కర్నూలు జిల్లాలో ఒక మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ హత్యకేసులో మరియు పలు హత్య కేసులలో, రేప్ కేసులు, ఒక ఎస్సై దాడి కేసులో ప్రధాన నిందితు డైన ఆరేకంటి కృష్ణుడు అలియాస్ కిష్టిగాడు కర్నూలు జిల్లా పత్తికొండ శివార్లలో పోలీసుల ఎన్‌కౌంటర్లో మృతి చెందాడు. అరెస్టు చేసి స్టేషన్‌కు తరలిస్తుండగా తన సంచీలో ఉన్న నాటు బాంబులతో పోలీసులపై ఎదురు దాడికి దిగిన కిష్టన్నను ఎన్‌కౌంటర్ చేయవలసి వచ్చిం దని జిల్లా ఎస్.పి వివరణ ఇచ్చారు."

పేపర్లో ఫోటోలో కిష్టిగాని శవం పక్కన అక్క డక్కడ నాటుబాంబులున్నై. పక్క పేజీలో శవం పక్కన రోదిస్తున్న కిష్టన్న భార్య, కొడుకూ అంటూ ఫోటో లున్నాయి. సిటీ కేబుల్ రిపోర్టర్ కిష్టన్న కొడుకు మణి గాడితో మాట్లాడించాడు.

"వంకాయ బాంబులు త్యానీకి సంతకుపోనాడు మా నాయన... ఎవులో సంపేసినారు..." వెక్కి వెక్కి ఏడ్చినాడు మణిగాడు.

రత్తాలుతో కూడా మాట్లాడించినారు.

"కూలి సేస్కోని బత్కెటోల్లం సారూ... పిల్లగాడు అనాదైపోయినాడు గద సారూ... అందరు పెదపెద దొంగోల్లు బతికిపోయినారు. మా సన్న పానాన్ని తీసేసి నారు గదా సామి. ఇదేమి నాయమో మీరే చెప్పండి సారూ," అంటూ రత్తాలు ఏడుస్తున్న టి.వి క్లిప్పింగ్ కొంతమందికి కంటతడి పెట్టించింది.

*

'ఫ్యాక్షన్ నిర్మూలన - శాంతి సంఘాల స్థాపన' అంశంపై జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో కర్నూల్లో సునయన ఆడిటోరియంలో సదస్సు జరి గింది. రాయలసీమ ఫ్యాక్షన్ జోన్ డి.ఐ.జి వి.ఎస్.ఎన్. మూర్తి సదస్సుకు అధ్యక్షత వహించారు. మంత్రివర్గ విస్తరణలో అటవీశాఖ లభించిన శంకర్రెడ్డి సభకు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మంత్రిగారి చేతుల మీదుగా జిల్లా ఎస్.పి. దేవానంద్ ఫ్యాక్షన్ అణచివేతలో ముందంజలో ఉన్నందుకు షీల్డు అందుకున్నాడు.

కర్నూలు జిల్లాలో బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా ప్రజాసంఘాల ధర్నా బ్యానర్ ఆడిటో రియం బయట గాలికి రెపరెపలాడుతోంది.

ప్రజాతంత్ర వర్తమాన సాహిత్య సంచిక, ఏప్రిల్ 2002